క్లుప్తంగా

నేడు మందిరం తృతీయ వార్షికోత్సవం

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో నిర్మించిన ధ్యాన యోగ సాయి మందిరం తృతీయ వార్షికోత్సవ ఈనెల 17న నిర్వహించనున్నట్లు గాయత్రీ విహార్ భక్త బృందం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటలకు పంచామృతాభిషేకం, 7.30 గంటలకు గణపతి పూజ, రుద్రాభిషేకం, హోమాలు, 10.30 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, 12 గంటల నుంచి అన్నప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల సత్తా



పెనమలూరు: జేఎన్‌టీయూకే అథ్లెటిక్స్ ఇంటర్ కాలేజీ పోటీల్లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 12, 13 తేదీల్లో సూరంపల్లి ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో పోటీలు జరిగాయి. వీఆర్ సిద్ధార్థ కాలేజీ పీడీ పోతిన రఘు శనివారం వివరాలు తెలిపారు. తమ కాలేజీ విద్యార్థులు ఎం.లోకేష్, వినాయక రెడ్డి, మణికంఠ ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో రజిత, జావెలిన్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో పతకాలు సాధించారన్నారు. వైస్ చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్ చాన్సలర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్ర, పాండురంగారావు అభినందనలు తెలిపారు.

దత్తాత్రేయునికి రజిత ఆభరణం సమర్పణ



కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో వేంచేసి ఉన్న ధ్యాన యోగ సాయి మందిరంలో దత్తాత్రేయ స్వామికి అజ్ఞాత భక్తుడు రజత వక్షస్థలం ఆభరణాన్ని శనివారం సమర్పించారు. 500 గ్రాముల వెండితో తయారుచేయించిన రజిత వక్షస్థలాన్ని గాయత్రీ విహార్ భక్త బృందాన్ని కలిసి స్వామి వారికి అలంకరణ నిమిత్తం అందజేశాడు. అజ్ఞాత భక్తుడిని భక్తబృందం ప్రత్యేకంగా సత్కరించింది.

నేడు కార్తిక వనసమారాధన

కంకిపాడు: శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 17న ఈడుపుగల్లులోని శ్రీ వెంకటేశ్వరకల్యాణ మండపంలో కార్తిక వన సమారాధన మహోత్సవం నిర్వహించనున్నట్లు గోసాల శాఖ గురూజీలు నేరెళ్ల తులసీ కృష్ణ, మాదు శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు గురువులకు స్వాగతం, 10 గంటలకు అశ్వినీదేవతలకు పూజలు, 11 గంటలకు సంగీతం, సాహిత్యం, నాట్య ప్రదర్శనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా కార్తికమాస పూజలు



గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో కార్తికమాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున తొలుత స్వామివారికి విశేష అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులచే విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీరామ పద రూపంలో కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి మహాపడిపూజ

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో ఈనెల 17వ తేదీన అయ్యప్పస్వామి మహాపడిపూజ, భజన మహోత్సవం నిర్వహించనున్నట్లు గురుస్వామి మరీదు శివశంకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తన 18వ శబరిమల యాత్ర సందర్భంగా గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద మహాపడిపూజ, భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గుంటుపల్లి శ్రీనివాసరావు గురుస్వామి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిపిస్తారన్నారు. భక్తులు, మాలధారులు పూజా కార్యక్రమంలో పాల్గొని భిక్ష స్వీకరించాలని కోరారు.

కానిస్టేబుల్ మృతి కేసులో నిందితుడి అరెస్ట్

ఉయ్యూరు: కానిస్టేబుల్ మృతికి కారణమైన కేసులో నిందితుడిని ఉయ్యూరు రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆకునూరు ఫ్లై ఓవర్ వద్ద ఈనెల 13వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పమిడిముక్కల పోలీసుస్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మత్తె రామకోటేశ్వరరావు మృతి చెందాడు. గొడవర్రు డిస్టిలరీలో పనిచేస్తున్న తన భార్యను ద్విచక్రవాహనం ఎక్కించుకుని ఉయ్యూరు వైపు వస్తుండగా గుర్తుతెలియని కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి సికింద్రాబాద్ నేరేడ్‌మేట్‌కు చెందిన పిసుపాటి వెంకట సంతోష హర్ష రాజేశ్వర కుమార్ కారణమని గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని పోలీసులు తెలిపారు.

గత అభివృద్ధి పనులపై అక్కసు

- ముగింపుదశలో ఆగిన కొత్త బస్టాండ్, సెంట్రల్ లైటింగ్ పనులు
- ప్రభుత్వం మార్పుతో ముందుకు సాగని వైనం
- కూటమి ప్రభుత్వ తీరుపై స్థానికుల్లో అసహనం

సెంట్రల్ లైటింగ్‌కు, బస్టాండ్ నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



కొద్దిపాటి వర్షానికే బురదమయంగా కొత్త బస్టాండ్ ప్రాంగణం (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పలు అభివృద్ధి పనులను ప్రస్తుతం ప్రభుత్వం తీవ్ర అక్కసుతో నిలిపివేసింది. హనుమాన్‌జంక్షన్‌లో అర్థాంతరంగా తుదిదశలో నిల్చిపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ తీరుపై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.9.6 కోట్ల నిధులు మంజూరు..

జంక్షన్ ప్రధాన రహదారులు, ముఖ్యకూడళ్లలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు దాదాపు రూ.9.6 కోట్ల వ్యయంతో పనులు మంజూరు చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరటంతో రూ.4.4 కోట్ల ఖర్చుతో కొత్త బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ముందుగానే దాదాపు 90 శాతం పనులు పూర్తి అయినప్పటికీ మిగిలిన అరకొర పనులు పూర్తి చేయకుండా ఎనిమిది నెలలుగా తాత్సరం చేయటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

జంక్షన్ రహదారులు విద్యుత్ కాంతులీనేనా..!

హనుమాన్‌జంక్షన్‌లోని ప్రధాన రహదారుల్లో రూ.9.6 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందే టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించారు. మార్చి నెల నాటికే శరవేగంగా 90 శాతం పనులు పూర్తి చేశారు. విజయవాడ రోడ్డు, ఏలూరురోడ్డు, గుడివాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో కలిపి మొత్తం ఆరు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఒక్కో విద్యుత్ స్తంభం మధ్య 40 మీటర్ల దూరంతో మొత్తం సుమారుగా 150 సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేశారు. జంక్షన్ మెయిన్ సెంటర్, వేలేరు క్రాస్ రోడ్డు, బైపాస్‌రోడ్డుల వద్ద నాలుగు హై మ్యాక్స్ సెంట్రల్ లైటింగ్ పోల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి కలగా మారిన సెంట్రల్ విద్యుత్ లైటింగ్ వ్యవస్థ నిజం కాబోతోందని స్థానికులు హర్షించారు. ఇంతలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఎక్కడి పనులు ఎక్కడే నిల్చిపోయాయి.

విద్యుత్ కనెక్షన్లు ఇస్తే సరి..

కేవలం విద్యుత్ కనెక్షన్లు ఇవ్వటమే ఇంకా మిగిలిన ఉన్న తరుణంలో ఎనిమిది నెలలుగా సెంట్రల్ లైటింగ్ స్తంభాలు ప్రధాన రహదారుల్లో అలంకారప్రాయంగా మారాయి. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి, విద్యుత్ లైట్లు కిందకు వెలాడుతున్నాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు నిలిపివేశారని, సెంట్రల్ లైట్లు వెలుగులు జిమ్మటం ఇక అనుమానమే అనే గుసగుసలు స్థానికుల్లో వినిపిస్తున్నాయి.

రూ.4.40 కోట్లతో బస్టాండ్ నిర్మిస్తే..

ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరటంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.4.40 కోట్ల వ్యయంతో కొత్త బస్‌స్టేషన్‌ను నిర్మించింది. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ తరుణంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ ఏడాది మార్చిలో నూతన బస్టాండ్‌ను ప్రారంభించారు. కానీ కొత్త బస్టాండ్ ప్రాంగణంలో సీసీ ప్లాట్‌ఫాం నిర్మించకపోవటంతో కొద్దిపాటి వర్షానికి కూడా బురదమయంగా మారుతోంది. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫామ్‌లు, బస్సులు తిరిగే ప్రాంతంలో బురదగా ఉండటంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రారంభానికి ముందే ఒరిగిపోయిన సెంట్రల్ లైటింగ్ స్తంభాలు

స్పందించాలని వినతి..

కొత్తగా నిర్మించిన బస్‌స్టేషన్ ప్రాంగణం గ్రావెల్ పోసి వదిలేయటంతో ఈ దుస్థితి ఏర్పడింది. పాత బస్టాండ్ ప్రాంగణం జాతీయ రహదారి కంటే పల్లంగా ఉండటంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. కొద్దిపాటి వర్షానికి కూడా పాత బస్టాండ్ ప్రాంగణం జలమయం కావటంతో ఆర్టీసీ బస్సులు లోనికి వెళ్లే పరిస్థితి లేక రహదారిపైనే ప్రయాణికులను దింపి వెళ్లిపోతున్నాయి. టీడీపీ ప్రజాప్రతినిధులు ఈ దుస్థితిపై దృష్టి పెట్టి తుదిదశలో మిగిలి ఉన్న బస్టాండ్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సెంట్రల్‌జోన్ రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ



రామవరప్పాడు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ జోన్ రైఫిల్ షూటింగ్ మెన్స్ అండ్ ఉమెన్స్ పోటీల్లో విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారని కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని శనివారం కళాశాలలో అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా బోయపాటి అప్పారావు మాట్లాడుతూ ఈనెల 15న నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సెంట్రల్ జోన్ రైఫిల్ షూటింగ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల విద్యార్థి పి.ఉదయ్ కిరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జేఎన్‌టీయూ కాకినాడ టీం సెలక్షన్‌లో ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్‌ను కళాశాల సెక్రటరి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ శరత్ అభినందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమనే సామెతను విద్యార్థులు ఆచరించాలని ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని అన్నారు. స్థానిక బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో 'చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్' కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవనంతోనే చదువులో రాణించగలమని చెప్పారు. అనంతరం బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష నేతృత్వంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో జోగేశ్వరరావు, జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ నాయకుడు అట్లూరి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను గౌరవించడం మన బాధ్యత



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్న సర్పంచి, సమితి సభ్యులు

గన్నవరం: దేశానికి అన్నం పెట్టే రైతులను గౌరవించడం అందరి బాధ్యతగా గుర్తించాలని గన్నవరం గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్య పేర్కొన్నారు. స్థానిక గౌడపేట రామాలయంలో శనివారం శ్రీపరంజ్యోతి అమ్మభగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో కృతజ్ఞత దినోత్సవంలో భాగంగా రైతులను సత్కారించారు. అనంతరం అన్నదాతలకు పార, తట్ట, కండువా, పండ్లు పంపిణీ చేశారు. ఈ సంద్భంగా సర్పంచి మాట్లాడుతూ..లాభనష్టాలతో సంబంధం లేకుండా దేశానికి అవసరమైన ఆహార ఉత్పత్తులను రైతులు అందిస్తున్నారని తెలిపారు. అటువంటి శ్రమజీవులైన అన్నదాతలను సత్కరించడం అభినందనీ యమన్నారు. సమాజానికి విలువైన సేవలందిస్తున్న వర్గాలను ప్రతియేటా ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సేవా సమితి సభ్యులు పి.పద్మావతి తెలిపారు. ఈ ఏడాది రైతులు, ఉపాధ్యాయులను సత్కరిస్తున్నట్లు చెప్పారు. తద్వారా ప్రజలను ఉన్నత విలువలు కలిగిన ఆదర్శ పౌరులుగా తయారు చేయడమే సమితి లక్ష్యమన్నారు. సేవా సమితి సభ్యులు జీ దుర్గ, పి.శివపార్వతి, సీహెచ్.అరుణకుమారి, సీహెచ్. శ్రీనివాసరావు, ఈ.కోటమ్మ, టి.నాగలక్ష్మి, పి.వీరాస్వామి, పి. గోపాలం తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీ అమలులో డిజిటల్ అసిస్టెంట్లు కీలకం

డీఎల్‌పీఓ ఎండీవీ ప్రసాద్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎల్‌పీఓ ఎండీవీ ప్రసాద్

విజయవాడరూరల్: జీపీడీపీ అమలులో డిజిటల్ అసిస్టెంట్లు కీలకమని ఇన్‌చార్జి డివిజనల్ పంచాయతీ అధికారి ఎండీవీ ప్రసాద్ అన్నారు. మూడు రోజులుగా విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రేడ్- 5 కార్యదర్శులకు జరుగుతున్న గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా డీఎల్‌పీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించి అమలు చేయడంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎంతో బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని అప్‌లోడ్ చేయడం డిజిటల్ అసిస్టెంట్ల బాధ్యత అన్నారు. గ్రామసభలను నిర్వహించడం, గ్రామంలోని ఓటర్లలో కనీసం 10 శాతం మంది గ్రామ సభలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. గ్రామ సభల్లో తీర్మానం చేసిన పనులు తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని, ఒక వేళ ఆలస్యం అయితే అలా వదిలి వేరే పనులు చేపట్టకుండా పాత తీర్మానాల పనులు ముందుగా జరిగే విధంగా చూడాలన్నారు. జీపీడీపీ అమలు చేయని పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నిధుల నుంచి గ్రాంట్లు రావన్నారు. మహిళలకు ప్రత్యేక సభలు నిర్వహించాలని, వారు తెలియజేసిన సమస్యలను పరిగణలోకి తీసుకొని వాటిని కార్యరూపం దాల్చేవిధంగా పనులు జరగాలన్నారు. బాలసభలను పాఠశాలల్లో నిర్వహించి వారి అవసరాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ముగింపు కార్యక్రమంలో గ్రేడ్- 5 కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాజిక సేవలో 'లయన్స్' ముందంజ



వరద బాధిత కుటుంబాలకు కిట్లు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కంకిపాడు: సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ గ్రాంటుతో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, దుస్తులు, వంట సామగ్రితో కూడిన కిట్‌లను కంకిపాడు బస్టాండు సెంటరులో శనివారం అందించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వరద కారణంగా ఇబ్బంది పడ్డ 50 కుటుంబాలను ఎంపిక చేసి కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు మాట్లాడుతూ విద్య, సామాజిక సేవా రంగాల్లో లయన్స్‌క్లబ్ సమర్థంగా పనిచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, జోన్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కంకిపాడు అధ్యక్షుడు వి.శివరామకృష్ణ, కార్యదర్శి ఎం.యుగంధర్, కోశాధికారి ఎస్.నిహార్, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ప్రతినిధులు మద్దుల గోవిందరావు, ఎం.రవితేజ, కుమార్ పాల్గొన్నారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి



శ్రీరామ్‌కు మెమొంటో అందజేస్తున్న అధ్యాపక బృందం

పెనమలూరు: సాంకేతికతను ఉపయోగించుకొని అభివృద్ధి సాధించాలని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ శ్రీరామ్ అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం టెక్నాలజీ అడ్వాన్సెస్ ఫర్‌స్మార్ట్ సిస్టమ్ డెవలప్‌మెంట్‌పై జరిగిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. శ్రీరామ్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. స్మార్టు సిస్టమ్ డెవలప్‌మెంట్‌తో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సి.సుబ్బారావు, వివిధ కాలేజీల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమ నేతల జీవితాలు స్ఫూర్తి



గన్నవరంలో గ్రంథాలయోద్యమ నేతలకు నివాళులర్పిస్తున్న గన్నె, నర్రా, చిమట



తెన్నేరులో చిత్రలేఖనం పోటీల్లో ..



వణుకూరు గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయోద్యమ నేతలను స్మరించుకున్నారు. గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, పలువురు నేతల చిత్రపటాలకు విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు, సభ్యులు చిమట రామారావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయం వారోత్సవాలలో శనివారం విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొన్నారు. డ్రాయింగ్, వకృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ పద్మావతి, గ్రంథాలయ అధికారి భారతి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు. పెనమలూరు గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పల్లిపేట ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి హరీష, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఆత్కూరు, మానికొండ, ఉంగుటూరు, తేలప్రోలు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆత్కూరు గ్రంథాలయాన్ని కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ సందర్శించారు. గ్రంథాలయాలను సద్వినియోగించుకుని ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికార్లు అయ్యారని తెలిపారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. హైస్కూల్ తెలుగు పండిట్ రాజు, లైబ్రేరియన్ కృష్ణారావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలోని వీరవల్లి, కానుమోలు, బాపులపాడు శాఖా గ్రంథాలయాల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పుస్తక పఠనంతో కలిగే లాభాలు, గ్రంథాలయాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, కుప్పిగంతులు వంటి ఆటల పోటీలను నిర్వహించారు.గ్రంథాలయ అధికారులు జె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిన్నరాజు, స్వర్ణలతాదేవి పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయ ఉద్యమ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణంలను స్మరించటం మన కర్తవ్యమని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయ అధికారి కె.కృపానందం పేర్కొన్నారు. శనివారం వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించి విజేతలను అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో..



వీరవల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంకిపాడు: తెన్నేరు శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జెడ్పీ పాఠశాల తెన్నేరు, ఎంపీఎంపీ పాఠశాల, చరిత స్కూల్‌లో పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలను ఎంపీ ఎంపీ పాఠశాల హెచ్‌ఎం శివకుమారి ప్రారంభించారు. 3, 4, 5 తరగతుల చిన్నారులకు మీకు నచ్చిన బొమ్మ, 6, 7 తరగతులకు మీ పాఠశాల, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మన జాతీయ నాయకుల అంశాల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

కంకిపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర, మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. సచివాలయం వద్ద నుంచి దావులూరు బాలాజీ మిల్లుకు ధాన్యం లోడు లారీని శనివారం జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మద్దతు ధర పొందేందుకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఎంపీటీసీ బూరగ బాలాజీ, వీఆర్‌ఓ కేఎం చైతన్య, వీఏఏ పి.వరప్రసాద్, కంకిపాడు పీఏసీఎస్ కార్యదర్శి ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

గన్నవరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శనివారం నెట్టూరి టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డే నిర్వహించారు. తొలుత ఆటల పోటీలను ప్రారంభించిన జెడ్పీటీసీ మాట్లాడుతూ.. క్రీడల ప్రాధాన్యతను గుర్తించి ప్రతియేటా స్పోర్ట్స్ వేడుకలను నిర్వహిస్తున్న ఎన్టీటీఎఫ్ యాజామాన్యాన్ని ఆమె అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్. కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ మహీధర్, మేనేజర్ పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాలు అందజేత

పెనమలూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ జూబిలీ సన్‌షైన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. పోరంకి విజ్ఞాన్ భారత్ పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి మాట్లాడుతూ విద్యార్థులు భగవద్గీత చదవటం వలన విజ్ఞానం, అనేక విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కొడాలి శేషాద్రిరావు, క్లబ్ అధ్యక్షుడు లయన్ నరేంద్ర, సభ్యులు విష్ణు, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

అందిరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రీయ బాలస్వాస్థ్య కరపత్రం ఆవిష్కరణ



పోరంకిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్, తదితరులు

పెనమలూరు: అందిరికీ ఆరోగ్య ప్రభుత్వ లక్ష్య మని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో తన కార్యాలయంలో శనివారం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కరపత్రం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో పిల్లలకు పుట్టుకతో వచ్చే వ్యాధులు, ఆరోగ్య సమస్యలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో పరీక్షలు చేసి వైద్యం అందిస్తారన్నారు.సర్వేలో అందరికి వైద్య పరీక్షలు చేసి వ్యాధులు ఉంటే నిర్ధారిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి బిజిలి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కోయా ఆనంద్‌ప్రసాద్, దేవినేని రాజా, తుమ్మల హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలస్వాస్థ్యపై అవగాహన

కంకిపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంపై కంకిపాడులో శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రజక రామాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద రాష్ట్రీయ బాలస్వాస్థ్య పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ 32 రకాల ఆరోగ్య పరమైన లక్షణాల ఆధారంగా చిన్నారుల ఆరోగ్య సమస్యలను గుర్తించటం జరుగుతుందన్నారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్యతో చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసరావు, కృష్ణారావు, సీహెచ్‌ఓ మంజు, కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రగతి నిరోధకాలు



ర్యాలీలో అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది

గన్నవరం రూరల్: బాల్య వివాహాలు సమాజ ప్రగతికి నిరోధకమని ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు పరిధిలోని ముస్తాబాద సెక్టార్ సూపర్‌వైజర్ నాగ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం సూరంపల్లి గ్రామంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో దత్తత, కిశోర వికాసం కార్యక్రమాలపై ప్రదర్శన, అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని, దత్తత దానికి మరో మార్గమని, బాలికా రక్షణ మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా అడ్డుకోవాలన్నారు. చదువు వారి హక్కుగా తెలియజేస్తూ తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందటం సులభతరమని చెప్పారు. కిశోర బాలల పరిస్థితులపై పాఠశాల స్థాయి నుంచి భయాన్ని పోగొట్టాలని, ఈ కృషిలో అందరూ భాగస్వాములు అవ్వాలని చెప్పారు. చైల్డ్ లైన్ అధికారులు, నాగరాజు, మేరి, సుష్మ, హైస్కూల్ హెచ్‌ఎం హరిచరణ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త ఈలప్రోలు కోటేశ్వరమ్మ, ఆయాలు పాల్గొన్నారు.